APTEL /25/A2860

E వార్త NEWS

సీమ వార్త
తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

సీమ వార్త తెలుగు దినపత్రిక ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా బ్యూరో ఇన్చార్జులు స్టాఫ్ రిపోర్టర్లు ఆర్సి ఇన్చార్జిలు వెంటనే కావలెను అర్హత కనీసం డిగ్రీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

వివరాలకు సంప్రదించండి
చీఫ్ ఎడిటర్ బీరె ఈశ్వరయ్య
9490860881

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 183 | పేజీలు : 4 | గురువారం 9 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



### తమిళనాడు, కేరళ, బెంగాల్, అసోంలో

# గెలుపెవరిది?



- సి-వోటర్ ఒపీనియన్ పోల్ ప్రకారం తమిళనాడులో పోటీ హోరాహోరీ
- 41 శాతం ఓట్లతో ముందంజలో అధికార డీఎంకే కూటమి
- దాని తర్వాతి స్థానంలో 38 శాతం ఓట్లతో అన్నాడీఎంకే కూటమి
- పశ్చిమబెంగాల్లో 44 శాతం ఓట్లతో అధికార తృణమూల్ కాంగ్రెస్ ముందంజ
- బీజేపీకి 40 శాతం దక్కే అవకాశం
- అస్సాంలో మరోసారి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం
- చివరిగా కేరళలో ఈసారి అధికార మార్పిడి తప్పేలా లేదు
- అధికార ఎల్డీఎఫ్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే

2

## రిక్రూట్మెంట్ బోర్డు ద్వారానే జోనల్ల పోస్టుల భర్తీ



- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- ఇకపై ఇచ్చే నోటిఫికేషన్ల జారీకి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది
- జీరో వెకెన్సీ కింద పోస్టుల భర్తీని ఎప్పటికప్పుడు చేబడుతున్నందున కొత్త నిర్ణయం ద్వారా త్వరితగతిన నియామకాలు పూర్తవుతాయి

**అమరావతి**

జోనల్ స్థాయి ఉద్యోగ నియామకాల ప్రక్రియలో మరింత పారదర్శకత పెంచే విషయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. రాష్ట్రంలోని 4 జోనల్ల కార్యాలయాలపై ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో కూడా జోనల్ల స్థాయి పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీ నుంచి ఎంపిక జాబితా ఖరారు వరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రక్రూటుమెంటు బోర్డు (ఏపీఎంఎస్ఆర్బీ) ద్వారా జరుగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇకపై ఇచ్చే నోటిఫికేషన్ల జారీకి ఈ నిర్ణయం - మిగతా3లో




## మతంలోని మూఢనమ్మకాలను గుర్తించే అధికారం మాకు ఉంది

- మత ఆచారాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవన్న కేంద్ర ప్రభుత్వం
- మూఢనమ్మకాలను గుర్తించే అధికారం ఉందన్న సుప్రీంకోర్టు
- 'న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు

2


# ఎలక్ట్రానిక్ బస్సుల వినియోగం పెంచాలి

- రోడ్ల కనెక్టివిటీతో ఎకనామిక్ యాక్టివిటీ
- జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం
- రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టుల సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్ చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం, వివిధ రాష్ట్రాలను అనుసంధానించేలా జాతీయ రహదారి ప్రాజెక్టుల - మిగతా3లో



## మహిళలకు రూ.2000- యువతకు ఉద్యోగాలు

- బంగాల్ కాంగ్రెస్ ఎన్నికల హామీలు
- మహిళలకు పోస్ట్-గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు ఉచిత విద్య
- ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను ఏడాదిలోపు భర్తీ చేస్తాం
- బంగాల్ అసెంబ్లీ వేళ మ్యానిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ

2



## భవానీపుర్ అసెంబ్లీ స్థానానికి మమత నామినేషన్

- సువేందు అధికారితో మరోసారి ఢీ
- భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు
- కాళీఘాట్ నివాసం నుంచి అలీపుర్ సర్వే బిల్డింగ్ వరకు రోడ్ షో
- రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించిన దీదీ

2

# త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు



- వారం రోజుల్లో కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం!
- సాధ్యమైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు
- వారం రోజుల్లో కొత్త ఎన్నికల కమిషనర్‌ను నియమించే అవకాశం
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్

**అమరావతి**

రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల ఓటర్ల జాబితాలు సేకరించి మున్సిపల్, పంచాయతీల వారీగా జాబితా సిద్ధం చేయనుంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు వేర్వేరుగా లేఖలు రాసింది. అదేవిధంగా రాష్ట్ర ప్రణాళికశాఖ చేపట్టిన బీసీ జనాభా లెక్కింపు చివరి దశకు చేరింది. అందులో భాగంగా ఏపీలో స్థానిక - మిగతా3లో



## ప్రతి ఒక్క సమస్యను వీలైనంత త్వరలోనే పరిష్కరిస్తా

- ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ హామీ
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజాదర్బార్
- అర్జీలు స్వీకరించిన మంత్రి
- ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన లోకేశ్

3




## కాల్పుల విరమణ శాశ్వత శాంతికి దారి తీస్తుంది

- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించిన భారత్
- వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గం
- వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకాలు ఉండవని ఆశిస్తున్నాం

2

# మతంలోని మూఢనమ్మకాలను గుర్తించే అధికారం మాకు ఉంది

'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది. 'న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్? బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్?, జస్టిస్? అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్, జస్టిస్? ప్రసన్న బి.వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది.




**కోర్టులకు ఆ అధికారం ఎక్కడిది?**

కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్? మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్?)? మాత్రమే సంస్కరణ (రిఫార్మ్? లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసన సభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.

**కోర్టుకు ఆ హక్కు ఉంది!**

మెహతా వాదనపై జస్టిస్ అమానుల్లా స్పందిస్తూ, "ఏదైనా మతాచారం మూఢనమ్మకమా, కాదా అని నిర్ణయించే హక్కు న్యాయస్థానానికి ఉంది. ఆ తర్వాత ఏం చేయాలనేది శాసనసభ చూసుకుంటుంది. కానీ శాసనసభ నిర్ణయమే అంతిమం అని కోర్టులో చెప్పలేరు" అని పేర్కొన్నారు. దీనిపై మెహతా స్పందిస్తూ, "మీరు లా విషయంలో నిపుణులు. మత విషయాల్లో కాదు. కనుక ఒక ఆచారాన్ని కేవలం మూఢనమ్మకంగా కోర్టు తేల్చలేదు. మనం ఎంతో వైవిధ్యమైన సమాజంలో ఉన్నాం. నాగాలాండ్‌లో మతపరమైన అంశం గా భావించేది, నాకు మూఢనమ్మకంగా అనిపిం చవచ్చు. మహారాష్ట్రలో 'బ్లాక్ మ్యాజిక్ చట్టం' ఉంది. అది మా ప్రాంతంలో ఉన్న ఆచారం, అందుకే మేము దానిని ఆర్టికల్ 25(2)(బి) కింద రక్షిస్తామని వారు అనవచ్చు" అని వాదించారు.

**చేతబడుల మాటేమిటి?**

దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, "ఒకవేళ చేతబడి మతపరమైన ఆచారంలో భాగంగా ఉంటే, దానిని మూఢనమ్మకంగా పరిగణించలేమా? మీ వాదన ప్రకారం, చేతబడి లాంటి ఆచారాలను నిషేధించే బాధ్యత శాసనసభకు మాత్రమే ఉంది. ఒక వేళ చట్టసభలు వీటి విషయంలో మౌనంగా ఉన్నాయని, ఎవరైనా ఆర్టికల్? 32 కింద కోర్టును ఆశ్రయిస్తే, ప్రజారోగ్యం, నైతికత, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని, ఆ ఆచారాన్ని నిషేధించడానికి కోర్టు ఆదేశాలు ఇవ్వలేదా?" అని ప్రశ్నించారు. దీనిపై సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ, "ఆరోగ్యం, నైతికత, శాంతిభద్రతల పరిధిలోకి వస్తే న్యాయ సమీక్ష చేయవచ్చు. కానీ మూఢనమ్మకం అనే కారణంతో కాదు" అని సమాధానం ఇచ్చారు.

**మరో మతంలోని అభిప్రాయాలను రద్దులేరు**

జస్టిస్ నాగరత్న తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, "ఏది అత్యవసర మతపరమైన ఆచారమో నిర్ణయించేటప్పుడు, కోర్టులు ఆ నిర్దిష్ట మతానికి చెందిన తత్వశాస్త్రాన్ని మాత్రమే ఆధారంగా చేసుకోవాలి. అంతేకాని మరో మతంలోని అభిప్రాయాలను దీనికి వర్తింపజేసి, అది అత్యవసర ఆచారం కాదని చెప్పలేరు. ఆరోగ్యం, నైతికత, శాంతిభద్రతలకు లోబటి, ఆయా మతాల తత్వాన్ని బట్టే కోర్టులు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది" అని అన్నారు.

**కేసు నేపథ్యం**

2018 సెప్టెంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. మహిళ ప్రవేశంపై నిషేధం ఉండడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఆ తర్వాత 2019 నవంబర్? 14న అప్పటి సీజేఐ రంజన్? గొగోయ్? నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికి బదిలీ చేసింది.

# భవానీపూర్ అసెంబ్లీ స్థానానికి మమత నామినేషన్

బంగాల్ రాజకీయాల్లో మరోసారి హైవోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బుధవారం తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. భారీ ర్యాలీ మధ్య అలిపుర్ సర్వే భవన్‌కు చేరుకున్న ఆమె, పార్టీ కార్యకర్తల నినాదాల నడుమ నామినేషన్ సమర్పించారు. కాళీఘాట్‌లోని తన నివాసం నుంచి ప్రారంభమైన రోడ్‌షోలో మమతా బెనర్జీ సుమారు 800 మీటర్లు నడుచుకుంటూ వెళ్లారు. మార్గమధ్యంలో అభిమానులకు చేతులు జోడించి అభివాదం చేశారు. తన జీవితంలో అన్నీ ఇక్కడి నుంచే ప్రారంభమయ్యాయని, తాను భవానీపూర్‌లోనే పుట్టి పెరిగానంటూ భావోద్వేగంగా స్పందించారు. అయితే ఈసారి భవానీపూర్ పోరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఎందుకంటే, ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ నాయకుడు, ప్రతిపక్ష నేత సువేందు అధికారి రంగంలో ఉన్నారు. ఇప్పటికే 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీని ఓడించిన సువేందు అధికారి, ఈసారి భవానీపూర్‌లో కూడా ఆమెను ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ పోటీపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. 2021లో నందిగ్రామ్‌లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ భవానీపూర్ ఉపఎన్నికలో విజయం సాధించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఎమ్మెల్యే సోభాందేబ్ చట్టోపాధ్యాయ తన పదవికి రాజీనామా చేసి ఆమెకు అవకాశం కల్పించారు. ఇప్పుడు అదే భవానీపూర్ నుంచి మమతా మళ్లీ పోటీకి దిగడం గమనార్హం. ఇదిలా ఉంటే, సువేందు అధికారి ఏప్రిల్ 2న తన నామినేషన్ దాఖలు చేశారు. ఆ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య ఆయనతో కలిసి హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్ నుంచి కూడా పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మమతా బెనర్జీ ఇప్పటికే పలు సభలు నిర్వహిస్తున్నారు. బీజేపీని "బంగాలీ సంస్కృతికి బాహ్య శక్తి"గా చిత్రీకరిస్తూ విమర్శలు చేస్తున్నారు. "ఎగ్ అండ్ ఫిష్" వ్యాఖ్యలతో ప్రాంతీయ భావోద్వేగాలను ప్రస్తావిస్తున్నారు. అలాగే ఇతర



రాష్ట్రాల్లో బంగాలీ కార్మికులపై జరుగుతున్న దాడుల అంశాన్ని కూడా ఆమె ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. ఇక తృణమూల్ కాంగ్రెస్ తమ ఎన్నికల ప్రచారంలో సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా లక్ష్మీర్ భండార్ పథకాన్ని హైలైట్ చేస్తోంది. ఈ పథకం కింద సాధారణ వర్గ మహిళలకు నెలకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ మహిళలకు రూ.1700 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించింది. అలాగే నిరుద్యోగ యువతకు కూడా నెలకు రూ.1500 అందిస్తామని హామీ ఇస్తోంది. మరోవైపు, బీజేపీ అక్రమ వలసదారుల అంశాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ప్రచారం సాగిస్తోంది. నందిగ్రామ్ ఫలితాన్ని భవానీపూర్‌లో పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సువేందు అధికారి నామినేషన్ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా, "ఈసారి ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదు. ఎవరూ ఓటర్లను అడ్డుకోలేరు. టీఎంసీని బంగాళాఖాతంలో కలిపేయాలి" అంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు. నామినేషన్ సందర్భంగా మమతా బెనర్జీతో పాటు పలువురు పార్టీ నేతలు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కోల్?కతా మేయర్ ఫిర్హాద్ హకీం సతీమణి రూబీ హకీం, స్థానిక నేతలు కూడా పాల్గొన్నారు. భవానీపూర్ ప్రాంతాన్ని మినీ ఇండియాగా అభివర్ణిస్తూ, వివిధ మతాలు, భాషల ప్రజలు కలిసి జీవిస్తున్న ప్రాంతమని టీఎంసీ ప్రచారం చేస్తోంది.

అయితే ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడంపై మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. "చాలా మంది పేర్లు ఓటర్ లిస్ట్ నుంచి తొలగించారు. ఎందుకు ఇలా జరిగిందో అర్థం కావడం లేదు. ఈ విషయంపై మేము మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం" అని ఆమె తెలిపారు. ఈసారి బంగాల్? అసెంబ్లీకి మొత్తం 294 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్.ఎం.ఎం.ఎస్ కు ఎంపిక

**– హెడ్మాస్టర్ రామకృష్ణ.**

ధర్మవరం ఏప్రియల్ 08, సీమ వార్త ;

ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ధర్మవరంలో 8వ తరగతి చదువుతున్న భాస్కర్ నాయక్ నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్ షిప్ పోటీ పరీక్షల్లో ఎన్నికై తన తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు అని ప్రధానోపాధ్యాయులు రామక్రిష్టప్ప తెలిపారు. విద్యార్థి ఉపాధ్యాయుల యొక్క ప్రయత్నాన్ని అభినందిస్తూ నాలుగు సంవత్సరాల పాటు 12 వేల రూపాయలు వంతున స్కాలర్షిప్ రావడం విద్యార్థికి ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరువలేమని తల్లిదండ్రులు తెలియజేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎన్సిసి యూనిట్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి. నాగేంద్ర సిటిఓ గా నియమించబడి 50 మంది విద్యార్థులను నైపుణ్యం తో కూడిన శిక్షణకు ఎన్నిక చేశారు అని తెలిపారు. విద్యార్థి దశలో ఎన్సిసి సి క్రమశిక్షణకు , సేవాభావాన్ని కలిగి ఉండే విధంగా విద్యార్థులను సిద్ధపరుస్తూ దేశ రక్షణలో భాగంగా భవిష్యత్తులో ద్వితీయ శ్రేణి విభాగపు రక్షణ సైనికులుగా నిలవడానికి సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్సిసి యూనిట్ లో శిక్షణ ద్వారా "ఏ"సర్టిఫికెట్ పొంది విద్య ఉద్యోగాల యందు ప్రత్యేక కేటాయింపులు అవకాశం కలిగి ఉన్నందున ఈ అవకాశాన్ని పట్టణంలోని విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ పొంది బంగారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీటీవో నాగేంద్ర తెలిపారు.



అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 11మంది విద్యార్థులు బాస్కెట్ బాల్,బాల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, నెట్ బాల్ వంటి రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటి పాఠశాలకు గుర్తింపు తేవడం అభినందనీయమని తెలిపారు. తదుపరి ఎన్ఎంఎంఎస్ ఎంపికైన భాస్కర్ నాయక్ కు హెడ్మాస్టర్ తో పాటు పిడి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందన శుభాకాంక్షలు తెలిపారు.



## తమిళనాడు, కేరళ, బెంగాల్, అసోంలో గెలుపెవరిది?

తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాంలో ఈ నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికలపై ఇప్పటికే పలు సర్వే సంస్థలు ఓటర్ల నుంచి అభిప్రాయ సేకరణలు చేసి ఫలితాలు ప్రకటించాయి. ఇప్పుడు సీఓటర్ సంస్థ తన తాజా సర్వేలో ఆయా రాష్ట్రాల్లో తాజాగా మారిన పరిస్థితుల ఆధారంగా మరింత పక్కాగా తన సర్వే ఫలితాలను వెల్లడించింది. సీఓటర్ తాజాగా నిర్వహించిన తాజా ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం.. సి-వోటర్ ఒపీనియన్ పోల్ ప్రకారం తమిళనాడులో పోటీ హోరాహోరీగా కొనసాగుతోంది. అధికార డీఎంకే కూటమి 41 శాతం ఓట్లతో ముందంజలో ఉండగా, దాని తర్వాతి స్థానంలో 38 శాతం ఓట్లతో అన్నాడీఎంకే కూటమి ఉంది. విజయ్ కొత్త పార్టీ టీవీకేకు అధికారం సంగతి తర్వాత.. కనీస సీట్లు రావడం కూడా కష్టమేనని తేలిపోయింది. పశ్చిమబెంగాల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 44 శాతం ఓట్లతో ముందంజలో కనిపిస్తోంది. బీజేపీకి 40 శాతం దక్కే అవకాశం ఉందని సర్వేలో తేలింది. అలాగే అస్సాంలో మరోసారి బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయంగా కనిపిస్తోందని సీఓటర్ ఒపీనియన్ పోల్ తేల్చింది. అస్సాంలో, బీజేపీ కూటమి 48 శాతం ఓట్లతో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ కూటమి 35శాతం ఓట్లు మాత్రమే సాధించే అవకాశం ఉందని ఈ సర్వేలో తేలింది. చివరిగా కేరళలో ఈసారి అధికార మార్పిడి తప్పేలా లేదు. అధికార ఎల్డీఎఫ్ కు 36 శాతం ఓట్లు మాత్రమే లభిస్తున్నాయని సీఓటర్ సర్వే తెలిపింది. విపక్ష యూడీఎఫ్ మాత్రం 40 శాతం ఓట్లతో ఆధిక్యంలో ఉన్నట్లు తేలింది. ఈ నాలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఫలితాలు మే 4న వెలువడనున్నాయి.

## మహిళలకు రూ.2000- యువతకు ఉద్యోగాలు



అసెంబ్లీ ఎన్నికల వేళ బంగాల్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ భారీ హామీలు ప్రకటించింది. బంగాల్‌లో అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు 2 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని పేర్కొంది. ఈ మేరకు ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ఖర్గే తెలిపారు. విద్యార్థినులకు పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీనికయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఖర్గే పేర్కొన్నారు. సన్నకారు, భూమిలేని రైతులకు ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. వ్యవసాయ అవసరాల కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ఖర్గే స్పష్టం చేశారు. 'యువ సమ్మాన్' పథకం కింద ప్రభుత్వంలో ఉన్న ఖాళీ పోస్టులను ఏడాదిలోగా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. బంగాల్‌లోని ప్రతి జిల్లాలో కృత్రిమ మేధ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఖర్గే వెల్లడించారు.

## ఉగ్రవాద సంస్థలతో లింక్ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు



ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు జమ్ము కశ్మీర్? లెఫ్టినెంట్? గవర్నర్? మనోజ్ సిన్హా. లష్కర్-ఎ-తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌తో లాంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాల నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(2)(సి) ప్రకారం తొలగించినట్లు బుధవారం అధికార వర్గాలు తెలిపాయి. ఫర్హత్ అలీ ఖండే, మహమ్మద్ షఫీ దార్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు చెప్పాయి. ప్రభుత్వ సంస్థల నుంచి ఉగ్రవాద శక్తులను నిర్మూలించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్' విధానంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

**2011లోనే ఫర్హత్ అలీ ఖండే అరెస్ట్**

రాంబన్ జిల్లా విద్యాశాఖలో క్లాస్- ఉద్యోగి ఫర్హత్ అలీ ఖండే హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థ కోసం పనిచేస్తున్నాడని అధికారులు గుర్తించారు. ఆ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలను పునరుద్ధరించడానికి, నెట్‌వర్క్‌ల నిర్మాణానికి తన ప్రభుత్వ పదవిని ఒక ముసుగుగా వాడుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఉగ్రవాదుల కుటుంబాలకు నిధులు పంపిణీ చేసే హవాలా నెట్‌వర్క్‌పై 2011లో జరిగిన దర్యాప్తులో ఖండే మొదటిసారిగా భద్రతా సంస్థల కంట్లో పడ్డాడు. అదే ఏడాది అతడిని అరెస్టు చేసినప్పటికీ, తరువాత బెయిల్ పొంది తన కార్యకలాపాలను కొనసాగించాడని ఆరోపణలు ఉన్నాయి. అతడు ఉగ్రవాద నెట్‌వర్క్‌లతో సంబంధాలు కొనసాగిస్తూ, మధ్యవర్తిగా వ్యవహరించాడని దర్యాప్తులో వెల్లడైంది. 2022లో అతడిపై ప్రత్యేక కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారని పేర్కొన్నారు.

**బెయిల్‌పై వచ్చి ఉగ్రవాద కార్యకలాపాలు**

"2011 ఏప్రిల్ వరకు ఫర్హత్ హిజ్బుల్ ముజాహిదీన్ కోసం పనిచేస్తున్నాడనే విషయం మాకు తెలియదు. ఏడు ఉగ్రవాద కుటుంబాలకు నిధులు పంపిణీ చేస్తున్న క్రమంలో జమ్ము కశ్మీర్ పోలీసులు పట్టుకున్న ఒక హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది విచారణలో అతడి పేరు చెప్పాడు. అప్పుడు పోలీసులు ఫర్హత్‌ను అదుపులోకి తీసుకుని జైలులో పెట్టారు. కానీ 2011 అక్టోబర్‌లో అతడు బెయిల్ పొంది తన ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగించాడు." అని అధికార వర్గాలు వెల్లడించాయి.

**క్రియాశీల ఉగ్రవాద సహచరుడిగా మారిన దార్**

మరో ఉద్యోగి బండిపోరాకు చెందిన మహమ్మద్ షఫీ దార్ గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్నాడని, అతడిది కారుణ్య నియామకమని అధికారులు తెలిపారు. అతడు లష్కర్-ఎ-తొయిబాకు ఉగ్రవాద సహచరుడిగా వ్యవహరిస్తున్నాడని గుర్తించారు. ఉగ్రవాదుల కదలికలను సులభతరం చేయడం, సురక్షిత గృహాలను ఏర్పాటు చేయడం, భద్రతా దళాల గురించి సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం సహా రవాణా, ఆపరేషనల్ మద్దతును అందిస్తున్నాడని ఆరోపణలు ఉన్నట్లు చెప్పారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన సంయుక్త నాకా తనిఖీలో దార్ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి ఏకే-56 రైఫిల్, గ్రెనేడ్‌తో సహా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వర్గాలు తెలిపాయి. అనంతరం జరిపిన విచారణలో అతడు క్రియాశీల ఉగ్రవాద సహచరుడిగా మారాడని, భద్రతా దళాలపై దాడుల ప్రణాళికలో పాలుపంచుకున్నాడని ఆరోపణలు ఉన్నట్లు తేలింది.

**90 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు**

ఇప్పటివరకు జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాద సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 90 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలనకు, ప్రభుత్వ వ్యవస్థలో దేశానికి హానికరమైన ఏ అంశమూ పనిచేయకుండా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఉగ్రవాదమనే క్యాన్సర్ అంతం చేసే వరకు తాను విశ్రమించబోనని లెఫ్టినెంట్ గవర్నర్? మనోజ్ సిన్హా ఇటీవల వ్యాఖ్యానించారు. భద్రతా సంస్థలు ఉగ్రవాద మహమ్మారిని పూర్తిగా, శాశ్వతంగా అంతం చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

సీమ వార్త
తెలుగు దినపత్రిక

# త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి
సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలను సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకాన్ని వారం రోజుల్లో చేపట్టే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రణాళికశాఖ చేపట్టిన బీసీ జనాభా లెక్కింపు చివరి దశకు చేరిందని నివేదించారు. ఇప్పటి వరకు 99.44 శాతం వివరాలు సేకరించారని, మరో పది రోజుల్లో ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ కోటాను నిర్ణయించేందుకే రాష్ట్రప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు.

**బాధ్యతలు తీసుకున్న ప్రత్యేక అధికారులు**

గ్రామపంచాయతీల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు ఇప్పటికే బాధ్యతలు తీసుకున్నారని అడ్వొకేట్ జనరల్ హైకోర్టుకు వెల్లడించారు. పూర్తి వివరాలు కోర్టు ముందు పెట్టేందుకు సమయం కోరారు. అందుచేత విచారణను ఈనెల(ఏప్రిల్)16కు హైకోర్టు వాయిదా వేసింది. ఈ విధంగా ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

అయితే బీసీ జన గణన, వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించబోతున్నారని పేర్కొంటూ రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు గత ఏడాది హైకోర్టులో పిల్ వేశారు. బీసీ జనాభాను లెక్కించి, అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేసి రాష్ట్ర పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. మరోవైపు న్యాయవాది తాండవ యోగేష్ పిల్ దాఖలు చేస్తూ 13,325 గ్రామపంచాయతీలకు, 123 పట్టణ స్థానిక సంస్థలకు పదవీ కాలం ముగియడంతో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు విచారణ జరుపుతోంది.




**ముగిసిన పాలకవర్గాల పదవీ కాలం**

మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి సంకేతాలు వెలువడుతున్న క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అందుకు తగ్గ ఏర్పాట్లను చేస్తోంది. అందులో భాగంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి తీసుకుంది. వీటి నుంచి రాష్ట్రంలోని మున్సిపల్, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తారు.

ఇందుకోసం రాష్ట్రంలోని మున్సిపల్, పంచాయతీల్లో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. ఇక ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయడం, బీసీ జనాభా లెక్కింపు పూర్తిచేయడమే తడవుగా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలన్న ప్రణాళికతో ఎన్నికల సంఘం ఉంది. అయితే 2021 ఫిబ్రవరిలో పంచాయతీలకు, అదే సంవత్సరం మార్చిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. మరోవైపు ప్రస్తుతం రాష్ట్రంలో పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు ఇప్పటికే బాధ్యతలు తీసుకున్నారు.

**రాష్ట్రంలో 1.20 లక్షల బ్యాలట్ బాక్సులు**

స్థానిక ఎన్నికలకు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి అదనంగా సుమారు లక్ష బ్యాలట్ బాక్సులు తెప్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం యోచిస్తుంది. గత ఎన్నికల సమయంలోనూ వివిధ రాష్ట్రాల నుంచి ఈ బాక్సులను తెప్పించారు. అయితే రాష్ట్రంలో ప్రస్తుతం 1.20 లక్షల బ్యాలట్ బాక్సులు ఉన్నాయి. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే అదనపు బాక్సులు అవసరమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ప్రతి ఒక్క సమస్యను వీలైనంత త్వరలోనే పరిష్కరిస్తా

కష్టాల్లో ఉన్న వారికి తానున్నానంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇస్తున్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో 87వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై పార్టీ కార్యాలయానికి తరలివచ్చిన సామాన్యులు, పార్టీ కార్యకర్తలను మంత్రి ఆప్యాయంగా పలకరించి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం నుంచే టీడీపీ ఆఫీసు దగ్గర సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి సామాన్య ప్రజలు, రైతులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్వయంగా వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా సమస్యలు పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గాలా డిపోను తరలించకుండా విజయవాడలోనే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్?ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ బోర్డును కొండపల్లి నుంచి మోటమర్రికి పెంచడం వల్ల గత 17 ఏళ్లుగా విజయవాడలో ఉన్న సికింద్రాబాద్(గాలా) డిపో ఉనికి సందిగ్ధంలో పడిందని సుమారు 500 కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయనే విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు.



**సమస్యల పరిష్కారానికి కృషి:**

అదే విధంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్?ను కోరారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్?మెంట్ కల్పించి ఆదుకోవాలని ఏపీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్?ను కలిసి విజ్ఞప్తి చేశారు.

నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన 2.63 ఎకరాల భూమిని శిరిగిరి చంద్రమౌళీశ్వర రెడ్డి ఆక్రమించారని కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ ఫిర్యాదుచేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రజల నుంచి వచ్చిన ఈ వినతులన్నింటినీ మంత్రి నారా లోకేశ్ జాగ్రత్తగా పరిశీలించారు. ఏ ఒక్క అర్జీ బుట్టదాఖలు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు.

# కూటమి ధీమా వెనుక కథేంటీ

**ఒంగోలు :** ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎం చంద్రబాబు.ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అసహనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుందని..అది జరగదని క్లియర్ కట్‌గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి..ఎస్పెషల్‌గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్‌లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్‌గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకి ఛాలెంజ్ కూడా చేస్తున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు.రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్‌మెంట్ అన్‌స్టాపబుల్ అన్నట్లుగా పరుగులు పెడుతుం దని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని..అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా..దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్‌గా ఓ కామెంట్ చేయడం అంటే ఆశామాషీ కాదు. ఆయన థర్టీ




ఇయర్స్ ఇండస్ట్రీగా పాలిటిక్స్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు. అలాంటి చంద్రబాబు తమ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రాదు..రానివ్వమంటూ ధీమా వ్యక్తం చేయడం..ఇండైరెక్ట్‌గా ఫ్యాన్ పార్టీని ఛాలెంజ్ చేయడం పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారిందఇంతకు బాబు ధైర్యం వెనుకున్న రహస్యం ఏంటన్నదే డిబేట్ పాయింట్ అవుతుంది. అధికారంలో ఉండి..పైగా ఇంకో మూడేళ్ల పాలన మిగిలి ఉండగానే..వైసీపీ ఎత్తులను పసిగట్టడం ఒక ఎత్తు అయితే..వైసీపీ పెట్టుకున్న ఆశలు అడిఆశలు అవుతాయని చెప్పడం మరో ఎత్తు. అయితే బాబు ఇంత కాన్ఫిడెంట్‌గా ఉండటానికి రీజనేంటి అన్నదే చర్చకు దారితీస్తోంది.నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాబు..చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడా ప్రజా వ్యతిరేకత రాకుండా..ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు అయినా..అభివృద్ధి విషయంలో అయినా..సంక్షేమ పథకాలు అమలులో అయినా..రాజకీయ విమర్శల్లో కూడా ఎక్కడా చిన్న మిస్టేక్ జరగకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు.ప్రజా వ్యతిరేకత రాకుండా ప్లాన్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే..ఎప్పటికప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వం గురించి ఏమనుకుంటున్నారు? ఏ విషయంలో అసంతృప్తిగా ఉన్నారని పబ్లిక్ పల్స్ తెలుసుకుంటున్నారు. పైగా సంక్షేమ పథకాల విషయంలో ఇచ్చిన మాట ప్రకారం ఒకదాని తర్వాత మరో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నారు.ఇప్పటికే కీలక పథకాలన్నింటిని గ్రౌండ్ చేశారు. మిగిలిన చిన్న చితక హామీలేమైనా ఉంటే ఎన్నికల నాటికి అవి కూడా ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ అన్ని విషయాలపై బేరీజు వేసుకుని..క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నాకే చంద్రబాబు భరోసా పెరిగిందన్న టాక్ వినిపిస్తోంది. ఏదైనా వైసీపీని టార్గెట్ చేస్తూ టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు అయితే ఏపీ పాలిటిక్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి.

## ఎలక్ట్రానిక్ బస్సుల వినియోగం పెంచాలి

-మొదటిపేజీ తరువాయి
నిర్మాణంపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి. మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే... వాటిల్లో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేయాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలి. రోడ్ల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే... వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్ధతులను అవలంబిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఆర్ అండ్ బీ రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల కొరత లేకుండా చూడాలి. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలి. రహదారి నిర్వహణకు ప్రామాణికతను నిర్దేశించాలి. స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతావరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట హైబ్రీడ్ మోడల్ లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుంది. కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనేది ఆలోచన చేయాలి. దీనిపై యూనివర్సిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. గోదావరి పుష్కరాలను దష్టిలో పెట్టుకుని గోదావరి, కష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టండి. గోదావరి జిల్లాలు, కష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలి. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రోడ్ల అభివద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా పనులు చేపట్టాలి. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివద్ధి చేయాలి. దీని కోసం సాస్కీ నిధులను వినియోగించుకోవాలి. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని' అని సీఎం సూచించారు. 'అతి తక్కువ వ్యయంతో ప్రజా రవాణా అందుబాటులోకి రావాలి. దీనికి ఈవీ బస్సుల వినియోగం సరైన మార్గం. క్లీన్ ఫ్యూయెల్ వినియోగం ఎక్కువ జరిగితే ఖర్చు తగ్గుతుంది. ఫలితాలు ప్రజలకు అందుతాయి. సోలార్ పవర్ ను సమర్థంగా నిర్వహించడం ద్వారా విద్యుత్ కొనుగోలు ధరను సుమారు రూ.1 మేర తగ్గించ గలిగాం. కాస్ట్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ఫ్యూయల్ విధానంపై దష్టి సారిస్తే తక్కువ ఖర్చు.. ఎక్కువ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈవీ బస్సులకు కిలోమీటరుకు రూ.72 వ్యయం అవుతోంది. వివిధ మోడళ్లను అధ్యయనం చేసి అతి తక్కువ వ్యయంతో ఈవీలను ఆపరేట్ చేయాలి. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ లాంటి అంశాలను పరిశీలించాలి. అన్నీ కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులే ఉండాలి. ఈ సైకిళ్ల వినియోగం మరింతగా పెంచేలా ప్రమోట్ చేయాలి. ఈ--సైకిళ్లు మాస్ ట్రాన్ పోర్టుగా మారేంతగా ప్రజలకు అవగాహన కల్పించాలని' సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రిక్రూట్మెంట్ బోర్డు ద్వారానే జోనల్ల పోస్టుల భర్తీ

-మొదటిపేజీ తరువాయి
అమల్లోనికి వస్తుందని చెప్పారు. జీరో వెకెన్సీ కింద పోస్టుల భర్తీని ఎప్పటికప్పుడు చేబడుతున్నందున కొత్త నిర్ణయం ద్వారా త్వరితగతిన నియామకాలు పూర్తవుతాయని, పాదదర్శకత మరింత పెరుగుతుందని మంత్రి వేడిక్కడ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్స్, ఫార్మసీ అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, మెడికల్ రికార్డు టెక్నిషియన్ పోస్టుల భర్తీ జోనల్ల వారీగా ప్రస్తుతం జరుగుతోంది. జోన్--1, జోన్--2, జోన్--3, జోన్ --4 కింద విశాఖ రాజమహేంద్రవరం, గుంటూరు, కడపలోని కార్యాలయాల కేంద్రంగా సదరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ ఎంపిక జాబితా ఖరారు, కౌన్సెలింగ్ పోస్టింగు ఉత్తర్వుల జారీ ప్రాంతీయ కార్యాలయాల ద్వారానే జరుగుతోంది. ఈ క్రమంలో పోస్టుల భర్తీ తీరుపై పలు సందర్భాల్లో విమర్శలు వస్తున్నాయి. ఈ మధ్యన రాజమహేంద్రవరం జోనల్ కార్యాలయం ద్వారా 310 వరకు నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా 12,000 వరకు దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల్లో పేర్కొన్న అర్హతలు, సీనియార్టీ, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించేందుకు 3 నెలల వరకు సమయం పట్టింది.. ఇలా పోస్టుల సంఖ్య అనుసరించి వచ్చే దరఖాస్తుల ప్రకారం ఎంపిక జాబితా ప్రకటించేందుకు ఎక్కువ సమయం పడుతోంది. ఈ జోనల్ల కార్యాలయంలో రికార్డు అసిస్టెంటు నుంచి సూపర్నెంటెండెంట్ల వరకు కలిపి సగటున 15 మంది వరకు ఉంటున్నారు. రిక్రూట్మెంటు బోర్డులో దరఖాస్తుల పరిశీలన దగ్గర నుంచి ఎంపికచేసిన వారి జాబితా ఖరారు వరకు తీసుకోవాల్సిన చర్యలపై బోర్డులో స్పష్టమైన విధానం అమల్లో ఉంది. ఈ బోర్డు ద్వారా రాష్ట్ర సాయి నియామకాలు (మెడికల్ ఆఫీసర్లు, అసిస్టెంటు ప్రొఫెసరు, సైక్రియాటిస్టులు, ఇతర పోస్టులు) జరుగుతున్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆయుష్ హెచ్ ఓ డీ కార్యాలయాల నుంచి ఇండెంట్ల ఆధారంగా రిక్రూటుమెంట్ బోర్డు నోటిఫికేషన్లు జారీచేసి, సదరు పోస్టుల ఎంపిక జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకుంటోంది. తాజాగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని 482 వైద్యుల నియామకాలు ఇదే విధంగా జరిగాయి. సరిగ్గా అదే విధానాన్ని జోనల్ల స్థాయి పోస్టుల భర్తీలోనూ అనుసరించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రిక్రూటుమెంటు బోర్డు ద్వారా గత 2024 జూన్ నుంచి మార్చి, 31 2026 వరకు 2,310 నియామకాలు జరిగాయి. త్వరలో బోధనాసుపత్రుల్లో 317 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ జరగబోతుందన్నారు.

## విశాఖ టూ మావిగన్

**శ్రీకాకుళం :** రాజధానుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక స్టాండ్ అంటూ లేకుండా పోతోంది. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు. మచిలీపట్నం- విజయవాడ- గుంటూరును కలుపుతూ మావిగన్ రాజధాని ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయం సూచించారు. దాదాపు అమరావతి రాజధానికి దగ్గరగానే ఆయన సూచనలు ఉన్నాయి. కానీ ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పడమే విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే ఈ మావిగన్ సూచించి ఉంటే బాగుండేది. పోనీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అనేకంటే.. ఈ మావిగన్ ప్రతిపాదన చేసి ఉంటే బాగుండేది. కానీ ఇప్పుడు ఆ ప్రతిపాదన చేస్తుండడం మాత్రం ఇబ్బందికరంగా మారింది. అనవసరంగా ఆయన టార్గెట్ అవుతూ వస్తున్నారు.ఒకవైపు మావిగన్ ప్రతిపాదన చేయగా.. ఇంకోవైపు ధర్మాన లాంటి సీనియర్ నేత వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అన్యాయం గురించి ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు ఇదే ధర్మాన మేధావి ఉత్తరాంధ్రకు రాజధాని ప్రకటించడాన్ని హర్షించారు. విశాఖ పాలన రాజధానిని ఆహ్వానించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఊరువాడ ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు ఆయన జగన్మోహన్ రెడ్డిని ఏం అనడం లేదు. ఆది నుంచి చంద్రబాబు స్టాండ్ అమరావతి. ఆయన మాట మార్చలేదు. కానీ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పాలన రాజధాని చేస్తానన్నారు జగన్. దానిని విస్తృతంగా ప్రచారం చేశారు ధర్మాన. 2024 ఎన్నికలకు ముందు ఈ సీనియర్ నేత తన సొంత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దీనిపైనే డిబేట్ పెట్టారు. ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు జగన్ మూడు రాజధానుల నుంచి మావిగన్ వైపు వెళ్తే దాని గురించి పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగింది అంటే అది జగన్మోహన్ రెడ్డి చేసినట్టే. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించారు. దానిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు ధర్మాన. ఇప్పుడు అదే జగన్ విశాఖ కాదు మావిగన్ అంటున్నాడు. కానీ ధర్మాన జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని.. విభజన చట్టమే చెప్పిందని.. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస వెళ్తున్నారని.. రాయలసీమ బిడ్డగా ఉండి ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీస్తున్నారు ధర్మాన. కానీ విశాఖ పాలన రాజధానిగా ప్రకటించి.. దాని నుంచి పక్కకు తప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డిని మాత్రం ఏమీ అనడం లేదు. అందుకే ధర్మాన అపరమేధావి అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు నమ్మలేని స్థితికి చేరుకున్నారు.

గురువారం 9 ఏప్రిల్ 2026

సీమ వార్త తెలుగు దినపత్రిక

## ఘనంగా శంకరం బాడీ వర్ధంతి వేడుకలు...



**తనకల్లు, ఏప్రిల్ 8 సీమ వార్త న్యూస్...** :అమడగూరు మండలంలోని లోకోజు పల్లి ప్రాథమిక పాఠశాలలో స్వర్గీయ శంకరంబాడి సుందరాచార్య వారి వర్ధంతి నిర్వహించడం జరిగింది. స్వర్గీయ శంకరంబాడి సుందరాచార్య 1914 ఆగస్టు 10 తిరుపతిలో జన్మించారు. చిన్నతనము నుండి ఆయన స్వతంత్ర భావాలు కలిగి ఉండేవాడు. ప్రాచీన సాంప్రదాయాలు పాటించకపోవడంతో ఆయన తండ్రి తరచూ కోపపడేవారు మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతం 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార గీతంగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఇది కేవలం ఆంధ్రప్రదేశ్ మాత్రమే పరిమితమైంది. భారతదేశంలో జన్మించిన అనేక మంది కవులు గొప్ప వ్యక్తుల గురించి మా దేశం మా దేశం మహా మంచి దేశం మంచిదిరా మా దేశం మా దేశం అనే గీతంలో ప్రస్తావించడం జరిగింది. తరువాత 1942లో దీనబంధు అనే సినిమాకి మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే గీతం రాశారు. అయినా ఆ సినిమాలో ఈ గీతము వాడుకోలేదు ఈ గీతాన్ని ప్రముఖ గాయని శ్రీమతి టంగుటూరు సూర్య కుమారి గారు గానం చేశారు. 1975లో అది ఆంధ్రప్రదేశ్ గీతంగా ఎంపికైంది ఆయనకు ప్రసన్న కవి సుందరకవి అనే బిరుదులు కూడా ఉన్నాయి. ఈ గీతాన్ని ప్రతిరోజు పాఠశాల ప్రార్థన సమయాలలో ఆలపించడం పరిపాటిగా మారింది. సేవలను స్మరణ చేసుకుంటూ ఈరోజు పాఠశాలలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తుదకు 1977 ఏప్రిల్ 8న ఆయన తృదిశ్వాస వదిలారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు శివశంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## 10 లక్షల వ్యయంతో ఇందిరమ్మ కాలనీలో సంస్కృతి సేవా సమితి ఆర్వో ప్లాంట్ ప్రారంభం





**ధర్మవరం రూరల్ ఏప్రిల్ 08 సీమవార్త :** ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించింది.గౌరవ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ స్థాపించిన సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయల భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆర్వో (జలశుద్ధి) ప్లాంట్ నేడు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని గౌరవ మంత్రి గారి సతీమణి శ్రీమతి త్రివేణి స్వయంగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీమతి త్రివేణి మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు శుద్ధమైన తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గమనించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ వెంటనే స్పందించి, ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యంగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు చిన్నారులు సురక్షితమైన తాగునీటిని పొందడం ద్వారా రోగాల బారి నుండి తప్పుకోవచ్చని, ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన నీరు అందించడమే మంత్రి సత్యకుమార్ యాదవ్ లక్ష్యమని శ్రీమతి త్రివేణి వివరించారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ఇప్పటికే ఎన్నో గొప్ప సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపడుతున్న సంస్కృతి సేవా సమితి.. ఇప్పుడు ఇందిరమ్మ కాలనీ ప్రజల దాహార్తిని తీరుస్తూ తన సేవా నిరతిని మరోసారి చాటుకుందని తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్లమూడి కృష్ణారావు వర్ధంతి లో .... పరిటాల సునీత, శ్రీరామ్

.....హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సునీతలి

.....అనంతపురంలోని తన నివాసంలో వడ్లమూడికి నివాళులర్పించిన శ్రీరామ్





**అనంతపురం ఏప్రిల్ 8 సీమ వార్త.**

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పరిటాల రవీంద్ర సోదరి భర్త వడ్లమూడి కృష్ణారావు వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. హైదరాబాద్ లోని వడ్లమూడి కుటుంబ సభ్యులతో కలసి నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. హైదరాబాద్ లోని ఘాట్ వద్ద ఆమె ఘనంగా నివాళులర్పించారు. ఇటు పరిటాల శ్రీరామ్ అనంతపురంలోని నివాసంలో తన మామయ్య వడ్లమూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధం గురించి సునీత, శ్రీరామ్ గుర్తు చేసుకున్నారు. మా కుటుంబానికి ఆయన తోడుగా ఉన్నారని.. అలాంటి వ్యక్తి లేకపోవడం తమకు ఎప్పటికీ లోటుగా ఉంటుందన్నారు.

## యాడికి లో గ్యాస్ కోసం తిప్పలు.

**యాడికి ఏప్రిల్ 08 సీమ వార్త**



ఇండియన్ గ్యాస్ ఓటిపి రాక ఇబ్బంది పడుతున్నారు ఓటిపి వచ్చాక కూడా 15 రోజులు పడుతుంది లైన్ లో వెయిట్ చేసి అలసిపోతున్న జనాలు ఎంటి సిలిండర్లు కూడా మాయమవుతున్నాయి పల్లె నుంచి కూడా జనాలు ఎక్కువ మంది వస్తున్నారు పల్లెలు కూడా సప్లై కాక ఇబ్బంది పడుతున్నారు ఇండియన్ గ్యాస్ టయానికి అందకపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్న ప్రజలు.

# ఖరీఫ్ లో సాగు విస్తీర్ణం పెరగాలి..

-- రైతులను ఖరీఫ్ కు సన్నద్ధత చేయడం , ఉత్పాదకత పెంచడం ప్రభుత్వ లక్ష్యం

---- ఆరుతడి పంటలుగా జొన్న,రాగి, సజ్జ సాగును ప్రోత్సహించాలి

---- జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఏప్రిల్ 8( సీమవార్త )**





రైతులను ఖరీఫ్ కు సన్నద్ధత చేయడం, సాగు విస్తీర్ణం పెంచడం, ఉత్పాదకత పెంచడం ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాలు నందు జిల్లాలో ప్రాథమిక రంగం అభివృద్ధిపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై అధికారులకు ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న సాగు విస్తీర్ణాన్ని మరో 10% అదనంగా పెంచేలా రైతులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి తమ పరిధిలో 15% వృద్ధిరేటు సాధించేలా కృషి చేయాలన్నారు.వరికి బదులుగా మొక్కజొన్న, రాగి వంటి ఆరుతడి పంటలను, అలాగే తక్కువ కాలంలో దిగుబడినిచ్చే కొర్ర, జొన్న, సజ్జ, అపరాల సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేకించి కదిరి ప్రాంతంలో విజయవంతమైన లి'చియా'లి పంటను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో కనీసం 100 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరిగేలా చూడాలన్నారు. పి.డి.ఎం.ఎస్. మోడల్ విత్తనాలు, బీజామృతాల తయారీపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాధార పంటలకు కీలక సమయంలో నీటి తడులు అందించేందుకు ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్ (పంట కుంట)ఏర్పాటు చేసుకునేలా చైతన్యం నింపాలన్నారు.వ్యవసాయ అధికారులు వారంలో కనీసం 4 రోజులు క్షేత్ర పర్యటనలు చేసి రైతులకు సాంకేతిక తోడ్పాటు అందించాలని, సిబ్బందికి ఆధునిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.మామిడి,దానిమ్మ, అరటి విస్తీర్ణం పెంచాలని, పట్టు పరిశ్రమలో కొత్త ప్లాంటేషన్ కోసం ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని (సాధారణ రైతులకు ?33,000, ఎస్సీ/ఎస్టీ రైతులకు ?40,000) సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు, సమాచారం అందించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తామని వెల్లడించారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఉద్యాన అధికారి చంద్రశేఖర్, పట్టు పరిశ్రమ అధికారిణి శోభారాణి, కోఆపరేటివ్ అధికారి కృష్ణ నాయక్, సూక్ష్మ నీటిపారుదల అధికారి సుదర్శన్ , ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కష్టానికి ఫలితం... పదవి కిరీటం.

.....జిల్లా బిజెపి ఎస్టీ మోర్చా నూతన జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక.

.... హాజరైన.... బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ కు ఘన సన్మానం.

**పుట్టపర్తి ఏప్రిల్ 8 సీమ వార్త.**



జిల్లా నూతన కార్యవర్గం బుధవారం స్థానిక పుట్టపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపిక చేశారు. శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షులు అర్జున్ నాయక్, పాల్గొని నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి దిశా నిర్దేశం చేశారు. బిజెపి పార్టీలో కష్ట పడి పనిచేస్తే ఎంతటి స్థాయికి సైతం ఎదుగుతారని పార్టీ లో గిరిజనులకు సముచిత స్థానము అందిస్తూ అదే విధంగా ఈ దశ అత్యున్నత రాజ్యంగ బద్ధ స్థానం రాష్ట్రపతి స్థానంలో గౌరవ పెద్దలు ద్రౌపతి ముర్ము ని ఎన్నుకున్న పార్టీ బిజెపి అని తెలియచేసారు. జిల్లా గిరిజన మోర్చాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తూ గిరిజనుల సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేయాలని తెలియచేసారు. ఈ సందర్భంగా మోర్చా అధ్యక్షులు అర్జున్ నాయక్ మాట్లాడుతూ ఈ జూరాష్ట్రంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పెద్దలు శ్రీ పి.వి.ఎన్.మాధవ్ నాయకత్వంలో, మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గౌరవ పెద్దలు శ్రీ వంగి రాజారావ్ మార్గనిర్దేశనంలో, రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి వర్యులు సత్యకుమార్ యాదవ్ సారథ్యంలో, పెద్దలు బిజెపి జిల్లా అధ్యక్షులు జి.యం.శేఖర్ సూచనలతో జిల్లాలో ఉన్న వివిధ రాష్ట్ర స్థాయి బాధ్యతలున్న నాయకులు, జిల్లా నాయకులు, నా తోటి సహచర మోర్చా అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల సలహాలు, సూచనలతో నూతన కార్యవర్గంతో కలిసి పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని తెలియచేసారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు జి.యం.శేఖర్ కి శాలువాతో పూలమాలతో ఎస్టి మోర్చా నూతన జిల్లా పదాదికారులు సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్ర శేఖర్ రెడ్డి, బీజేవైఎంరాష్ట్ర కార్యదర్శి ఉదయ్ కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బిల్లు కుళ్ళాయి యాదవ్ , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపినాథ్ . బిజెపి సీనియర్ నాయకులు కరణం నాగేష్ బాబు, హిందూపురం రూరల్ మండలం అధ్యక్షులు చక్రపాణి రెడ్డి బి జె వై యం జిల్లా కార్యదర్శి విరశెట్టి సాయి కుమార్ జిల్లాలో గల వివిధ అసెంబ్లీలలోని వివిధ తండాలకు సంబంధించిన నాయకులు, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర నాయక్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ నాయక్ వైస్ ప్రెసిడెంట్ మంజుల భాయ్, వి నందా నాయక్, ఆర్ చిరంజీవి నాయక్ కార్యదర్శిలు పి హరి నాయక్ రాము నాయక్, వి హరినాయక్ సోషల్ మీడియా కే శివ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం..
- మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సమీక్షా సమావేశం
- మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

**పుట్టపర్తి ఏప్రిల్08 (సీమవార్త బ్యూరో) :-**



పుట్టపర్తి మున్సిపాలిటీనీ అందరం కలిసికట్టుగా అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సువర్ణ అధ్యక్షతన బుధవారం మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో తీవ్రంగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే పుట్టపర్తి మున్సిపాలిటీ 120 స్థానంలో ఉండడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి చేశారు. చిత్రావతి లోకి మురుగునీరు కలుషితంపై మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తక్షణం మురికి నీరు నదిలోకి వెళ్లకుండా ప్రత్యేక పైప్లైన్ వేసి వాటిని అరికట్టాలని ఆదేశించారు. అదేవిధంగా పట్టణంలో త్రాగునీటి సమస్య రాకుండా అదనపు మోటర్లు కొత్త బోర్లు వేసి ప్రజలకు దాహార్తిని తీర్చాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుట్టపర్తి పట్టణంలో పారిశుద్ధ్యంతో పాటు వీధిలైట్లు మురుగుదొడ్లు కాలువలు శుభ్రంగా ఉంచుకునే నిత్యం పర్యవేక్షణ చేసి అందమైన పట్టణంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ నిర్లక్ష్యం వల్ల పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదని మండిపడ్డారు. మున్సిపాలిటీకి రావలసిన పన్ను బకాయిలు కూడా సక్రమంగా వసూలు చేయడం లేదని పేర్కొన్నారు. పట్టణంలో మున్సిపాలిటీకి పెండింగ్ ఉన్న బకాయిలను వెంటనే రాబట్టి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అధికారులు నిత్యం వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకనైనా నిర్లక్ష్యం వీడి పుట్టపర్తి మున్సిపాలిటీని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లి ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పుట్టపర్తి మున్సిపాలిటీ స్పెషలాఫీసర్ ఆర్డీవో సువర్ణ, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, ఏ ఈ స్వాతి, నరసింహులు ,రాజేష్ , ప్రేమ్ కుమార్, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల దాడిలో జైలు సిబ్బందికి గాయాలు

- రుచిలేని ఆహారంపై నిరసన
- బళ్లారి సెంట్రల్ జైలులో ఘటన

**బళ్లారి, ఏప్రిల్ 9 సీమవార్త:**




తమకు వడ్డిస్తున్న ఆహారం రుచిగా లేదంటూ నిరసన చేపట్టిన ఖైదీలు, జైలు సిబ్బందిపై దాడి చేయడంతో పలువురు సిబ్బంది గాయపడ్డారు. పరిస్థితి గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డాక్టర్ సుమన్ పన్నేకర్, ఏఎస్పీ నవీన్ కుమార్ నేతృత్వంలోని పోలీసు బృందం జైలు ప్రాంగణంలోకి ప్రవేశించి, భద్రతా బలగాలను మోహరించి, ఖైదీలను తిరిగి వారి బ్యారక్‌లకు తరలించడంలో విజయం సాధించారు. గాయపడిన సిబ్బందిని అంబులెన్స్‌లో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. జైలు సూపరింటెండెంట్ సెలవులో ఉన్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గత కొద్ది రోజులుగా తమకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత లోపించిందని, రుచిగా లేదని ఖైదీలు ఇంతకుముందే జైలు సిబ్బందికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే, తమ ఫిర్యాదులను సిబ్బంది పట్టించుకోకపోవడంతో, బుధవారం నాడు ఖైదీలు జైలు లోపల నిరసన ప్రదర్శన చేపట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిరసన సమయంలో, కొందరు ఖైదీలు జైలు సిబ్బందిపై భౌతికంగా దాడి చేసి గాయపరిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, గత కొన్ని నెలలుగా జైలులో బీడీలు, సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాల సరఫరాను నిషేధించి, కఠిన క్రమశిక్షణా చర్యలు అమలు చేస్తున్నారు. బళ్లారి జైలులో నటుడు దర్శన్ ఖైదీగా ఉన్న సమయంలో జరిగిన కొన్ని ఘటనల నేపథ్యంలో, పోలీసు అధికారులు చేపట్టిన భద్రతా, క్రమశిక్షణా చర్యలే ఖైదీల ఆగ్రహానికి కారణమయ్యాయని తెలుస్తోంది. జిల్లా ఏఎస్పీ నవీన్ కుమార్, ఇతర పోలీసు అధికారుల బృందంతో కలిసి జైలును సందర్శించి, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తమకు ఎటువంటి అక్రమ సదుపాయాలు లభించడం లేదనే అసహనంతో ఉన్న అల్తాఫ్, రషీద్, నవీన్, సలీం, రాజు అనే ఖైదీలు జైలు సిబ్బందిత

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881